సాక్షి
కర్నూలు
శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



అలరించిన పౌరాణిక నాటకం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై గుంటూరు జిల్లాకు చెందిన కాశీనాగ విశ్వేశ్వర సాంస్కృతిక సేవా సంస్థ వారిచే ప్రదర్శించిన శ్రీకృష్ణరాయ బారం పౌరాణిక నాటకం ఆకట్టుకుంది.



వీధి కుక్కల దాడి..

పత్తికొండ పట్టణంలోని అన్ని కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికం అయ్యింది. వీటి దాడిలో శుక్రవారం 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒక మహి ళకు తీవ్ర గాయాలయ్యాయి. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,625.90
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 79.466
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 44,650
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 36,232

న్యూస్‌రీల్

మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు



హాస్టల్‌లో భోజనాలను పరిశీలిస్తున్న ప్రసూన

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి కె.ప్రసూన హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆమె నగరంలోని రెండు బీసీ కళాశాల బాలికల వసతి గృహాలు, ఒక ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా వసతి గృహాల్లోని పరిసరాలను పరిశీలించి మరింత శుభ్రంగా ఉంచుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. అలాగే వంట గది, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి విద్యార్థుల కోసం వండిన వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పలు హాస్టళ్లలో మెనూ సక్రమంగా పాటించడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. తాను చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో ఎక్కడైనా విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయా వసతి గృహాల్లోని విద్యార్థినులతో హాస్టళ్లలో అందుతున్న సౌకర్యాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు.

సమైక్యతను చాటారు.. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి

- జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి

కర్నూలు: కర్నూలు, ఆదోనిలో గణేశ్ నిమజ్జన వేడుకల సందర్భంగా సమైక్యతను, సమగ్రతను చాటి చెప్పారని, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా భవిష్యత్తులో కూడా జిల్లా ప్రజలు ఇదే స్ఫూర్తిని కొనసాగించి పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలు, మత పెద్దలు, రాజకీయ పార్టీలు, గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువత, మీడియాకు ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. సమాజ కర్తవ్యం, అంకిత భావంతో నిమజ్జన బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

'ఫారెస్ట్' పోస్టుల భర్తీకి రేపు స్క్రీనింగ్ టెస్ట్



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

కర్నూలు (సెంట్రల్): ఫారెస్ట్ శాఖలోని అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏపీపీఎస్సీ నిర్వహించే అటవీ శాఖ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయా పరీక్షల కోసం జిల్లాలో 33 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పరీక్షలు 10 నుంచి 12:30 గంటల వరకు, మధ్యాహ్నం సెక్షన్ ఆఫీసర్ పోస్టుకు సంబంధించిన పరీక్షను 3 నుంచి 5:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, లేదంటే ఏదైనా గుర్తింపు కార్డులను హాల్‌టిక్కెట్‌తో పాటు తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని 15 నిమిషాలకు ముందుగానే సూచించారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎల్రక్టానిక్ పరికరాలను అనుమతించబోరన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల పెంపు

జూపాడుబంగ్లా: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 30 వేల నుంచి 32 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి 1,16,422 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా డ్యాంలో 883.60 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 2, 4, 5, 6,7 గేట్ల అడుగు మేర ఎత్తి 32 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 13 వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ (జీఎన్ఎస్ఎస్) కాల్వకు 13 వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 6వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

'భూగర్భ' శోకం

వర్షాలు అధికంగా కురిసి వాగులు, వంకలు, నదుల్లో నీరు పోటెత్తింది. పొలాలు నీట మునిగి తీవ్ర పంట నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో నీరంతా వృథాగా సముద్రం పాలైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా చోట్ల ఈ ఏడాది 'భూగర్భ' శోకమే మిగిలింది. చెరువులు, ఊట కుంటల్లో నీరు స్వల్పంగా కనిపిస్తోంది. భూగర్భ జలాలు లేక వ్యవసాయ బోర్లు పనిచేయకపోవడం, బావుల్లో నీరు అరకొరగా ఉండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది.

- అడుగంటిన భూగర్భ జలాలు
- బావులు, బోర్ల కింద సాగు దయనీయం
- గతేడాది 6.78 మీటర్లలో జలం
- ఈ ఏడాది 7.80 మీటర్లకు పడిపోయిన వైనం
- మొత్తం 1.02 మీటర్ల తగ్గిన భూగర్భ జలాలు
- కోసిగి, ఓర్వకల్లు, గోనెగండ్ల మండలాల్లో పరిస్థితి దారుణం



వెల్దుర్తి మండలంలో నీరు లేక ఎండిపోయిన వ్యవసాయ బావి



గోనెగండ్ల మండలంలో భూగర్భ జలాలు లేక వృథాగా ఉండిపోయిన బోరు

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాకాలంలోనే భూగర్భ జలాల పరిస్థితి దయనీయంగా తయారైంది. సాధారణంగా జూలై నెలలోనే ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెరువులు, కుంటలు నీటితో నిండి కళకళలాడుతూ ఉండేవి. ఈ సారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కొన్ని మండలాల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ చెరువుల్లోకి నీరు చేరలేదు. కుంటలు వెలవెలబోతూ కనిపించాయి. వర్షాకాలం మొదలై మూడు నెలలు అవుతున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. మే నెలలో వర్షాలు మురిపించినప్పటికీ జూన్, జూలై నెలల్లో అంతంతమాత్రానికే పరిమితం కావడంతో భూగర్భ జలాలు పడిపోయాయి.

అడుగంటిన ఆశలు

జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు 246 ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం వీటి కింద 27,707 ఎకరాల భూములు ఉన్నాయి. మొత్తం 50 శాతం ట్యాంకుల్లో నీటి నిల్వలు అంతంతమాత్రమే ఉన్నాయి. ఫలితంగా భూగర్భ జలాలుఎ పడిపోయాయి. జిల్లా మొత్తం మీద 2024 నవంబరు నెలలో సగటున 6.78 మీటర్లలో భూగర్భజలాలు ఉన్నాయి. అయితే 2025 జూలై నెలలో 7.80 మీటర్లలోకి పడిపోయాయి. గతేడాది నవంబరు నెలతో పోలిస్తే ఈ సారి జూలైలో 1.02 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఫలితంగా బావులు, బోర్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద సాగు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ బావులు, బోర్ల కింద రైతులు పంటలు సాగు చేయలేని దుస్థితిలో ఉన్నారు.

'కాకి' లెక్కలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద భూగర్భ జలాలు పెరగడానికి అవసరమైన పనులు చేపట్టాల్సి ఉంది. అయితే టీడీపీ నేతలు అక్రమ సంపాదనకు అవకాశం ఉండే పనులవైపు మొగ్గు చూపారు. పనులన్నీ కాగితాలపై కనిపిస్తున్నా... క్షేత్రస్థాయిలో కనిపించని పరిస్థితి ఏర్పడింది. 2024–25లో అటవీ ప్రాంతాలు, బీడు భూముల్లో 726, 2025–26లో 114 డగౌంట్ పాండ్స్ నిర్మించినట్లు లెక్కలు ఉన్నాయి. 2025–26లో 8,500 పాంఫాండ్స్ నిర్మించాల్సి ఉండగా 4,000 పాంఫాండ్స్ పనులు పూర్తయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. ఇవన్నీ కాగితాల్లోనే కనిపిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

ఇదీ దుస్థితి..

- కర్నూలు జిల్లాలో 26 మండలాలు ఉన్నాయి. వీటిలో 18 మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితి నిరాశజనకంగా ఉంది.
- జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. ఉండగా 74.3 మి.మీ. మాత్రమే నమోదైంది.
- జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. ఉండగా 76.2 మి.మీ. మాత్రమే నమోదైంది.
- అంతంతమాత్రం వర్షాలు పడటం, చెరువుల్లో సంతృప్తికరంగా నీరు చేరకపోవడంతో భూగర్భ జలాలు ఆందోళన కలిగిస్తున్నాయి.
- జిల్లాలో భూగర్భ జలాలను అంచనా వేసేందుకు 62 పిజియోమీటర్లు ఉన్నాయి. ఈ ఏడాది జూలై లెక్కలను పరిశీలిస్తే భూగర్భ జలాలు అడుగంటాయి. జిల్లాలో సగానికిపైగా గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉందని భూగర్భ జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.
- కోసిగి, ఓర్వకల్లు, ఆస్పరి, కౌతాళం, హాలహర్వి, ఆదోని, ఆలూరు, దేవనకొండ, హాలహర్వి, కోడుమూరు, కర్నూలు అర్బన్, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో భూగర్భ జలాలు పెరగలేదు. దీంతో ఉద్యాన పంటలు, కూరగాయలు పంటల సాగు పుంజుకోలేదు.

ప్ర'జల' కష్టాలు ఇవీ..

- మండల కేంద్రమైన గోనెగండ్లలో 2024 నవంబరులో 1.14 మీటర్లలోనే భూగర్భ జలాలు ఉన్నాయి. ప్రస్తుతం 8.77 మీటర్ల లోతులో కనిపిస్తున్నాయి. గత ఏడాది నవంబరు నెలతో పోలిస్తే నేడు 7.63 మీటర్ల మేర జలాలు తగ్గిపోయాయి.
- కోసిగి మండలం వందగల్లు గ్రామంలో 2024 జూలైలో భూగర్భ జలాలు 38.75 మీటర్లలో ఉన్నాయి. 2025 మే నెలలో 40.02 మీటర్లలోకి పడిపోయాయి. జూలై నెలలో 39.65 మీటర్ల లోతులో కనిపించాయి. వర్షాకాలంలో భూగర్భ జలాలు పెరుగాల్సి ఉండగా తగ్గడంపై రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- కోసిగి, ఓర్వకల్లు, గోనెగండ్ల మండలాల్లో వెయ్యి అడుగుల మేర బోరు వేసినా గంగమ్మ బయటికి రాని పరిస్థితి ఏర్పడింది.
- జిల్లాలో 1,14,286 బోరు బావులు ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వానా కాలంలోనే 30 శాతం బోర్లు మరుగున పడ్డాయి. రానున్న రోజుల్లో వర్షాలు పడితే వీటిల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కనిపించని పురోగతి

చేసిన పనులనే మళ్లీ చేస్తుండటంతో భూగర్భ జలాల్లో పురోగతి కనిపించడం లేదు. జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ఎక్కడా పనులు చేయలేదు. కాల్వలు, చెక్‌డ్యామ్‌లు, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. డగౌటు పాండ్స్, ఫాంపాండ్స్ వంటి వాటిని నిర్మించలేదు. ఇవన్నీ కాగితాల్లోనే ఉండటం, క్షేత్రస్థాయిలో కనిపించకపోవడంతో వర్షాలు పడుతున్నా భూగర్భ జలాలు పెరగలేదు.

భూగర్భ జలాలు తగ్గాయి

ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు తక్కువగా ఉండటం భూగర్భ జలాలపై ప్రభావం పడింది. వరుసగా రెండు నెలలు లోటు వర్షపాతం నమోదు కావడంతో జిల్లా భూగర్భ జలాలు తగ్గిపోయాయి. గత ఏడాది ఇదే సమయంతో పోల్చి చూస్తే సగానికిపైగా మండలాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయినట్లు స్పష్టం అవుతోంది. అయితే ఆగస్టు నెలలో వర్షాలు కురవడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ఎం.శ్రీనివాసరావు, డీడీ, గ్రౌండ్ వాటర్

డాక్టర్.. ఉద్యోగాల్లేవ్!

- నిష్ప్రయోజనంగా మారిన ఫార్మా–డి కోర్సు
- ఉమ్మడి జిల్లాలో 1400 మందికి పైగా నిరుద్యోగులు



కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఆఫ్ ఫార్మసి (ఫార్మా–డి) కోర్సును పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు దొరకడం లేదు. దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ కోర్సును 2008లో అప్పటి యుపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కోర్సు చేసిన వారికి డాక్టర్‌తో సమానంగా హోదా లభిస్తుందని చెప్పడంతో అప్పట్లో విద్యార్థులు చాలా మంది ఆసక్తి చూపించారు. కర్నూలు జిల్లాలో రెండు, నంద్యాల జిల్లాలో రెండు ఫార్మసి కాలేజీల్లో ఒక్కో దాంట్లో 30 సీట్ల చొప్పున కోర్సును ప్రారంభించారు. అప్పట్లో ఎంబీబీఎస్‌లో సీటు రాని వారు డెంటల్ లేదా ఫార్మా–డి కోర్సును ఎంచుకునేవారు.

కొత్త పోస్టులు లేవు


ఎంబీబీఎస్‌తో సమానంగా ఈ కోర్సు ఆరు సంవత్సరాలు(5 ప్లస్ 1 సంవత్సరం ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్) చదవాల్సి ఉంది. క్లినికల్ ఓరియంటెడ్ ప్రొఫెషనల్ డాక్టోరల్ ప్రోగ్రామ్, హ్యూమన్ అనాటమి అండ్ ఫిజియాలజీ, ఫార్మకాలజి మొదలైన వాటితో పాఠ్యాంశాలు బోధించారు. ఎవిడెన్స్ బేస్డ్ మెడిసిన్ ఆధారంగా రోగులకు హేతుబద్ధమైన డ్రగ్ థెరపిని అందించేందుకు డ్రగ్ జ్ఞానాన్ని వర్తింపజేసేందుకు సహాయపడుతుంది. క్లినికల్ ఫార్మాసిస్ట్‌ల పాత్ర అభివృద్ధి చెందిన దేశాల్లో బాగా గుర్తించారు.. ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం ఈ కోర్సును ఆమోదించింది. ఒక విధంగా చెప్పాలంటే పేరు ముందు డాక్టర్ అని రాసుకోవచ్చని అప్పట్లో విద్యార్థులను ఊరించారు. ఈ కోర్సు చదివిన వారికి ఫార్మా కంపెనీల్లో రీసెర్చ్ విభాగంలో ఉద్యోగంలో చేరవచ్చని చెప్పారు. అయితే వీరిని ఉపయోగించేందుకు కొత్త పోస్టులు సృష్టించలేదు.

చెల్లని చెక్కులా మారిన ఫార్మా–డి పట్టా



కళాశాలల్లో ఆరేళ్ల పాటు ఎంబీబీఎస్‌తో సమానంగా చదివిన ఫార్మ్–డి విద్యార్థులు పట్టా చేతిలో తీసుకుని బయటకు వస్తే వారికి ఎక్కడ చూసినా చీకటే కనిపిస్తోంది. ఈ పట్టాతో ఎవ్వరూ ఉద్యోగం ఇవ్వడం లేదు. ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా వీరి కోసం పోస్టులను సృష్టించలేదు. ప్రైవేటుకు వెళితే మీ కంటే బి.ఫార్మసి వారిని తీసుకుంటే మేలని, వారి కంటే మీది ఉన్నతమైన అర్హత అవుతుందని, మీ లాంటి వారితో పనిచేయించుకోవడం కష్టమని దెప్పి పొడిచారు..ఇంకా పొడుస్తున్నారు. 2013 తర్వాత పట్టా తీసుకుని ఇప్పటి వరకు 1400 మంది దాకా ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఫార్మ్–డి నిరుద్యోగులు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

ఎక్కువ చదివారని ఉద్యోగం ఇవ్వడం లేదు



ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో మేం ఫార్మా–డి కోర్సును పూర్తి చేశాం. ఎంబీబీఎస్‌తో సమానంగా సబ్జెక్టులు చదివి, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి పట్టా తీసుకుని బయటకు వచ్చాం. ఇప్పుడు మాకు ఉద్యోగం ఇచ్చేవారే కరువయ్యారు. బి.ఫార్మసీ అర్హతతో ఉన్న ఉద్యోగాలకు వెళితే మీరు చాలా ఎక్కువ చదివారని, ఈ ఉద్యోగం మీకివ్వలేమని చెబుతున్నారు. మాలాంటి వారి సేవలను ప్రభుత్వం ఉపయోగించుకోవాలి.

– డాక్టర్ ఎస్. లక్ష్మీకాంత్, ప్రెసిడెంట్ అసోసియేషన్ ఆఫ్ డాక్టర్ ఆఫ్ ఫార్మసీ, ఏపీ

632 బస్తాల ఎరువులు సీజ్



ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గడివేముల: మండల కేంద్రం గడివేములలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఎరువుల దుకాణాలపై దాడులు చేసి 632 ఎరువుల బస్తాల్ సీజ్ చేశారు. ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడటంతో విజిలెన్స్ సీఐ పవన్ కుమార్, డీసీటీఓ వెంకటరమణ తదితరులు మూడు దుకాణాల్లో తనిఖీలు చేశారు. ధనలక్ష్మీ ఎరువుల దుకాణంలో యూరియా బస్తా అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించి 266 బస్తాలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. అదే విధంగా వెంకటేశ్వర ట్రేడర్స్‌లో 20.20.0.13 బస్తాలు 220, దుర్గ భవాని దుకాణంలో 146 బస్తాలు సీజ్ చేశామన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొందరు వ్యాపారులు యూరియాను నిల్వ ఉంచి అధిక ధరలకు అమ్మే ప్రయత్నాలు చేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

శాంతి.. ఐక్యత... భక్తి

- ఆధ్యాత్మికతను నింపిన మిలాద్ – ఉన్ – నబీ
- దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- హాజరైన మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్



లాల్ దర్గా నుంచి రాజ్‌విహార్ సర్కిల్ వరకు ర్యాలీగా వస్తున్న ముస్లింలు, చిత్రంలో హఫీజ్‌ఖాన్, ఎస్వీమోహన్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు

కర్నూలు(అర్బన్): ముస్లింల పవిత్ర పర్వదినం, ప్రవక్త హజ్రత్ మహమ్మద్ జన్మదినం సందర్భంగా మిలాద్ – ఉన్ – నబీ పండుగను శుక్రవారం ముస్లింలు పవిత్రంగా జరుపుకున్నారు. దర్గాల్లో ప్రత్యేక ప్రార్థన చేశారు. అన్ని ప్రాంతాల్లో శాంతి, ఐక్యత, భక్తి వెల్లివిరిసింది. సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మసీదులైన రోజా దర్గా, హజ్రత్ లతీఫ్ లౌబాలీ దర్గా, లాల్ మస్జీద్, కలీ కరీం మస్జీద్, మచ్చివాలే సాహెబ్ నివాసం తదితర ఆధ్యాత్మిక కేంద్రాల్లో జియారత్ – ఏ – ఆసార్ – ఏ – ముబారక్ నిర్వహించారు. సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ నేతృత్వంలో హజ్రత్ లతీఫ్ లౌబాలీ దర్గా నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముస్లిం మత పెద్దలు సజ్జాద గాహ్, ముషాయిఖీన్‌తో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో చిన్నారులు ఇస్లామిక్ జెండాలు ఊపుతు, తమ చిన్న సైకిళ్లపై రావడంతో ర్యాలీ మరింత అందంగా మారింది. ఈ నేపథ్యంలోనే ర్యాలీలో పాల్గొన్న ప్రజలు దరూద్ షరీఫ్ చదువుతూ లాల్ మసీద్ రోడ్డులో మిఠాయిలు పంపిణీ చేశారు.

మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాలి

కర్నూలు రాజ్ విహార్ సెంటర్ వద్ద ఉన్న దర్గా ప్రాంతంలో బహిరంగ సభ నిర్వహించారు. మత పెద్దలు ముక్దూమ్ సాహెబ్, అమ్జద్ నక్ష్‌బంది, సయ్యద్ మహ్మద్ సాహెబ్ ఖాద్రీ పీర్ తాహెరీ రిజ్వీ, సయ్యద్ దాదా బాషా ఖాద్రీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ ముజంమిల్, డీఎస్పీ బాబుప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త జన్మించి 1500 సంవత్సరాలు పూర్తి అయ్యిందన్నారు. హింస, అరాచకాలు, రక్తపాతం, రాక్షసత్వం కలిగిన సమయంలో వాటిని నిర్మూలించేందుకు మహమ్మద్ ప్రవక్త జన్మించారన్నారు. తల్లి పాదాల చెంతే స్వర్గం ఉందని, తండ్రి ద్వారం లాంటి వాడని చెప్పారు. ఇదే రోజు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువు గొప్పతనాన్ని కూడా వివరించారు. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలైన ముగ్గురికి ఉమ్రా టికెట్లు, ఐదు మందికి అజ్మీర్ షరీఫ్ యాత్ర టికెట్లను బహుమతిగా అందించారు.



బహిరంగ సభకు హాజరైన ముస్లింలు

శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ నేతలు

మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని రాజ్ విహార్ సెంటర్‌లోని దర్గా ప్రాంతంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తదితరులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలను తెలిపారు. నగరంలోని అన్ని మతాలు, వర్గాలకు చెందిన వారు ఐక్యంగా, సంతోషంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో గత నెల 27వ తేదీన ప్రారంభమైన గణపతి నవరాత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో భాగంగా రత్నగర్భ గణపతికి, సాక్షి గణపతికి, యాగశాలలో నెలకొల్పిన పంచలోహ వరసిద్ధి వినాయక స్వామికి, సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతికి వ్రతకల్పపూర్వక పూజలు చేపట్టారు. గణపతి, జయాదిహోమం నిర్వహించారు. అధికారులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతిని శుక్రవారం సాయంత్రం నిమజ్జనం చేశారు.



పంచలోహ వరసిద్ధి వినాయకస్వామికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



గురుభ్యోనమః

కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో శుక్రవారం గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు నివాళులర్పించారు.

– వివరాలు 8లో▸

క్లుప్తంగా

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

● క్షేమంగా బయటపడ్డ ప్రయాణికులు



కోడుమూరు రూరల్: ఆర్టీసీ బస్సు గేర్ రాడ్ విరిగిపోవడంతో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని వెంకటగిరి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. కోడుమూరు నుంచి వెల్దుర్తికి 21 మంది ప్రయాణికులతో డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం ఉదయం బయలుదేరింది. అయితే వెంకటగిరి గ్రామం దాటిన తర్వాత అనుగొండ రోడ్డులో బస్సుకు సంబంధించిన గేర్ రాడ్ ఒక్కసారిగా విరిగిపోయింది. దీంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ప్రమాదం నుంచి బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులందరు క్షేమంగా బయటపడ్డారు.

13న నర్సెస్ అసోసియేషన్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు లీలావతి

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ నర్సెస్ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదిన నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు ఎం. లీలావతి చెప్పారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యదర్శి సి.బంగారి, ట్రెజరర్ కె.లక్ష్మీనరసమ్మలతో కలిసి ఆమె మాట్లాడారు. ఈ సర్వసభ్య సమావేశం ఆసుపత్రిలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.రాధమ్మ, జనరల్ సెక్రటరి ఎస్.కోటమ్మ హాజరవుతారన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని సభ్యులందరూ తప్పకుండా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో నేటి (శనివారం) నుంచి 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఇందుకోసం 79 మంది ప్రత్యేకాధికారులను నియమించినట్లు చెప్పారు. శుక్రవారం ఆయన మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లెలను బాగు చేయాలన్న ఉద్దేశంతో పల్లెకు పోదాం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ప్రతి మండలంలో 3 గ్రామాలు చొప్పున 79 గ్రామాలను ఎంపిక చేశామని, ఇందుకోసం 79 మంది అధికారులను నియమించినట్లు చెప్పారు. వారు ఏ గ్రామాలకు వెళ్లాలనే విషయాన్ని వారికి తెలిపినట్లు చెప్పారు. వీరంతా శనివారం ఉదయం 9 గంటలకు నిర్దేశించిన గ్రామానికి చేరుకొని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, హాస్పిటళ్లు, హాస్టల్ తదితర ప్రభుత్వ సంస్థలు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలన చేస్తారు. తాగునీటి సరఫరా, వైద్య సేవలు, ఇళ్ల నిర్మాణాలు, రోడ్ల సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం, పారిశుద్ధ్యం కార్యక్రమాలను పరిశీలిస్తారన్నారు. నిర్దేశించిన గ్రామాలకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓఆర్డీ తమ బృందాలతో స్పెషల్ ఆఫీసర్ వెంట వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా సహృదయంతో నిర్వహించాలన్నారు. స్వచ్ఛాంధ్ర అవార్డులకు సంబంధించి ఆయా శాఖలు సమాచారాన్ని 9లోపు పంపాలన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది

● 45 మంది గురువులకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

కర్నూలు(సెంట్రల్): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని, వారిని గౌరవించే సంప్రదాయం వర్ధిల్లాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురుపూజోత్సవం(జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి ఉప రాష్ట్రపతి, రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. జీవితంలో ఏ స్థాయికి ఎదిగినా గురువులను గౌరవించుకోవాలన్నారు. కేవలం చదువే కాకుండా నైతిక విలువలతో కూడిన జీవనం అలవర్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. త్వరలోనే ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు అవసరమైన కొత్త స్టూడియోను ఏర్పాటు చేస్తామన్నారు. తాను సిల్వర్ జూబ్లీ కాలేజీలో బీఈడీ పూర్తి చేసి ఉపాధ్యాయుడిగా స్థిరపడాలని అనుకున్నానని, అయితే మరో ఉద్యోగం రావడంతో కాలేకపోయానన్నారు. బోధనపై ఉన్న ఆసక్తితో బీఈడీ చేసే సమయంలోనే డిగ్రీ విద్యార్థులకు గణితం బోధించానని, డీఎస్సీ విద్యార్థులు కోచింగ్ ఇచ్చినట్లు గుర్తు చేసుకున్నారు.

డీఈఓ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిని చూసి సుగుణాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రుల నుంచి ఆస్తులు సంక్రమించినట్లు ఉపాధ్యాయుల నుంచి విద్యార్థులకు క్రమశిక్షణ, నైపుణ్యాలు అలవడుతాయన్నారు. ఉపాధ్యాయులు దైవంతో సమానమని, వారిని గౌరవించడం ఎప్పుడూ ఆనందమేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు, 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతారెడ్డి, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతి, రాష్ట్ర బొందిలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధారనగర్ విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలకు రెండు కంప్యూటర్లు

ఎంపీ లాడ్స్ నుంచి జిల్లాలోని ప్రతి పాఠశాలకు రెండు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కంప్యూటర్లను ఇస్తాం. నేను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకొని ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించా. ఆ తర్వాతే ఎంపీ అయ్యాను.

బస్తిపాటి నాగరాజు, కర్నూలు ఎంపీ

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన 45 మంది గురువులను శాలువా కప్పి పూలమాల వేసి సన్మానించి మెమెంటోతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఇందులో 31 మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కాగా, 14 మంది జూనియర్ కళాశాలల్లో బోధన చేసే అధ్యాపకులు. కాగా, మరో ఆరుగురు పాఠశాలల పీడీలను స్పోర్ట్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డుల కింద సన్మానించారు. అంతకముందు శారద నృత్య కళాశాల విద్యార్థులు దివ్యాన్స్, హిమ వర్షిణి నృత్యం ఆకట్టుకోగా కలెక్టర్, ఎంపీ వారిని సన్మానించి మెమెంటోలను అందజేశారు.

ఆహ్వానం పంపినా గైర్హాజరు

జిల్లాలోని కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు గురుపూజోత్సవం ఆసక్తి చూపకపోవడం విమర్శలకు తావిస్తోంది. పాణ్యం ఎమ్మెల్యే ప్రసంగం చేసి మధ్యలోనే వెళ్లిపోయారు. ఇక మంత్రి టీజీ భరత్, కోడుమూరు ఎమ్మెలే బొగ్గుల దస్తగిరి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ బి.పార్థసారథి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆహ్వానాలు పంపినా హాజరు కాకపోవడం గమనార్హం. ప్రజాప్రతినిధుల తీరు పట్ల టీచర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సి.బెళగల్ ఎంఈఓ 2 కె. ఆదం బాషాను సన్మానిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎంపీ నాగరాజు, డీఈఓ శామ్యూల్ పాల్



షేక్‌ఉస్మాన్, టి.గోకులపాడు | కె.వెంకటేశ్వర్లు, పి.కోటకొండ | పి.మనోరమ, గూడూరు | సూర్యప్రకాష్ రెడ్డి, కర్నూలు | చిన్న బసవరాజు, గాజులదిన్నె | సుబ్రహ్మణ్యం శర్మ, కౌతాళం



సౌభాగ్య రాణి, గుండ్లకొండ | రంగనాయకులు, చిప్పగిరి | నిరంజన్ కుమార్, ఆదోని | హలీం సిద్దిఖీ, కర్నూలు | జి.జె.సునిల్ రాజ్ కుమార్, ఆదోని | కె.గోపాల్, కపటి, ఆదోని



పీఎల్ రంగన్న, కర్నూలు | ఎ.చంద్రమోహన్, లక్ష్మీతాండ | పురుషోత్తం ఆచారి, కపటి | నాగేంద్ర కుమార్, కనకవీడు | పద్మావతి, కర్నూలు | బి.హసీనా, దొడ్డనకేరి



బి.శ్రీనివాసులు, అరికెర, ఆలూరు | యుఎస్ అయ్యప్ప, కౌతాళం | మంగలి మారుతి, పులికొండ | ఎం.బాలచంద్రుడు, అరికెర, ఆలూరు | ఎం శోభాదేవి, ఎర్రబాడు | కళ్యాణ్ కుమారి, జేఎం తాండ



కె.అరుణ జ్యోతి, బదినేహాళ్ | ఎం.రామ్మోహన్, మాధవరం | డాక్టర్ శ్రీదేవి, డీసీఓ, కర్నూలు | యమున, డీసీఓ, కర్నూలు | డి.దుర్దన ఫర్వీన్, గోనెగండ్ల | జి.రామన్న, పెద్దహరివాణం | ఇమల్లన్న, మంత్రాలయం | సుదీంద్ర కుమార్, కర్నూలు

స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు...



మిలిటరీ కాలనీ జడ్పీహెచ్ఎస్ పీడీ | కంబాలపాడు జడ్పీహెచ్ఎస్ పీడీ | ఇతాండ్రపాడు జడ్పీహెచ్ఎస్ పీడీ



కోసిగి జడ్పీహెచ్ఎస్ పీడీ | మంత్రాలయం జడ్పీహెచ్ఎస్ పీడీ | సన్మానం పొందిన పీడీ గిడ్డయ్య



జి.గీత, జీజేసీ (టౌన్), కర్నూలు | వి.లావణ్య, జీజేసీ, కర్నూలు | వి.నాగరాజు, జీజేసీ, కర్నూలు



జి.ప్రమీల, జీజేసీ (టౌన్), కర్నూలు | షేక్ రేష్మ, జీజేసీ, కర్నూలు | షాహినా బేగం, జీజేసీ, కర్నూలు



జి.శ్రీనివాసులు, జీజేసీ, కర్నూలు | కె.సువర్ణ దేవి, జీజేసీ, కర్నూలు | అఫ్రోజ్ సుల్తానా, జీజేసీ, కర్నూలు



జేవీ రమణ గుప్త, జీజేసీ, కర్నూలు | మధుసూదన, జీజేసీ, కర్నూలు | ఆర్.సురేష్, జీజేసీ, గోనెగండ్ల

సురవరం స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ

● సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళి అర్పించిన వివిధ రాజకీయ పార్టీల నేతలు

కర్నూలు(అర్బన్): పేద ప్రజల కోసం జరిగిన అనేక ఉద్యమాలకు సురవరం సుధాకర్‌రెడ్డి నాయకత్వం వహించారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా ఉద్యమాలు చేపడతామని వక్తలు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను సీపీఐ జిల్లా అధ్యక్షులు కే గిడ్డయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముందుగా సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ మాట్లాడుతూ రెండు సార్లు ఎంపీగా విజయం సాధించినా సురవరం నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. ధనిక కుటుంబంలో జన్మించిన సురవరం పేదల పక్షాన నిలిచిన వామపక్ష యోధుడని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ కొనియాడారు. నేటి తరానికి సురవరం ఎంతో ఆదర్శమని రాజ్యసభ మాజీ



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలులో విద్యార్థి దశ నుంచే సురవరం సుధాకర్ రెడ్డి ఉద్యమ బాట పట్టారన్నారు. అంచెలంచెలుగా ఎదిగి సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి చేపట్టిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పీ రామచంద్రయ్య మాట్లాడుతూ జిల్లాలోని మొలగవెల్లి గ్రామంలో జరిగిన భూపోరాటంలో 1100 ఎకరాలను పేదలకు పంపిణీ చేయించడంలో సురవరం కీలక పాత్ర పోషించారన్నారు. సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, కే రామాంజనేయులు, ఎస్ మునెప్ప, పీ రామక్రిష్టారెడ్డి, నాగన్న, సీపీఐ ఎంఎల్ నాయకులు సుంకన్న, బస్తిపాడు రామక్రిష్టారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, రవిగువేరా తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో 12 మందికి గాయాలు

పత్తికొండ: వీధి కుక్కల దాడిలో 12 మందికి గాయాలయ్యాయి. వీరిలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆదోని మండలం మదిరె గ్రామానికి చెందిన చాకలి అయ్యమ్మ అనే మహిళ పని నిమి త్తం పత్తికొండకు వచ్చారు. ఆమెతోపాటు మరో 11 మంది రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా అక్కడే ఉన్న వీధి కుక్కలు దాడి చేశాయి. అక్కడ ఉన్న స్థానికులు గమనించి కుక్కలను తరిమారు. గాయపడిన వారిని వైద్య చికిత్సల నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పత్తికొండ పట్టణంలోని అన్ని కాలనీల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, వీటిని నియంత్రించేందుకు గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



గాయాల పాలైన మహిళ

గోబీ సరుకులు తీసుకొస్తూ...

– రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిప్పగిరి: గోబీ సరుకుల తీసుకొస్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరులో గోబీ వ్యాపారం చేస్తూ జీవనం సాగించే అసిఫ్ అక్బర్ వలి (31) సరుకుల కోసం గుంతకల్లు వెళ్లాడు. సరుకులు తీసుకుని గురువారం రాత్రి మోటారు సైకిల్‌పై తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో చిప్పగిరి గ్రామానికి చెందిన ఇబ్రహీం అనే యువకుడు కుందగుర్తి నుంచి సొంత ఊరికి మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. చిప్పగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొనడంతో అక్బర్ వలికి తీవ్ర గాయాలయ్యాయి. ఇబ్రహీంకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో ఇబ్రహీంను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తలించారు. అక్బర్‌వలి పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు తెలిపారు.



మృతి చెందిన అక్బర్ వలి (ఫైల్)

మార్కెట్ యార్డులో రూ.12కే కిలో ఉల్లి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మార్కెట్ యార్డులో రూ.12కే కిలో ఉల్లి లభ్యమవుతోందని, వ్యాపారులు, హోటళ్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ డాక్టర్ బి.నవ్య సూచించారు. ఆమె శుక్రవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో హోటళ్ల యజమానులు, చిరు వ్యాపారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కర్నూలు మార్కెట్ యార్డులో, నగరంలోని రేషన్ షాపుల్లోనూ ఉల్లిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈమేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎస్ఓ, ఆహార నియంత్రణాధికారులను ఆదేశించారు.

రైతుల ఉసురుకు కూటమి కొట్టుకుపోతుంది!



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా

● టీడీపీ నాయకులకే యూరియా
● ఈ కష్టాలు రైతులకు ఎప్పుడూ రాలేదు


బొమ్మలసత్రం: రైతుల ఉసురు పోసుకుని కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో కొట్టుకుపోతుందని ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా విమర్శించారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ పనులు చేసుకోనివ్వకుండా కూటమి ప్రభుత్వం యూరియా కోసం రోడ్డెక్కేలా చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కష్టాల్లో ఉన్న రైతులను పరామర్శించేందుకు వెళ్తే రైతులపై కేసులు పెట్టి కక్షపూరితంగా వ్యవహరించడం తగదన్నారు. రాష్ట్రానికి అరకొరగా వచ్చిన యూరియాను సీఎం చంద్రబాబు ఇచ్చిన దోచుకో.. దాచుకో.. పిలుపు మేరకూ టీడీపీ నాయకులు యూరియాను దోచుకోవడం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం జరుగుతుందన్నారు. సెప్టెంబర్ నెలలో 1.55 లక్షల టన్నుల యూరియా రాష్ట్రానికి అవసరం కాగా 94 వేల టన్నులు మాత్రమే పంపిణీ జరిగిందన్నారు. తక్కువ నిల్వలను కూడా కావాల్సిన వారికి ఇచ్చుకుంటున్నారని విమర్శించారు. మినుములు ప్రభుత్వం రూ.8 వేలు గిట్టుబాటు ధర కల్పిస్తుందని చెబుతున్నా రూ. 4 వేలు మాత్రమే లభిస్తుందన్నారు. రైతుల సమస్యల పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకూ జిల్లా కలెక్టర్‌కు ఈనెల 9న వినతి పత్రం అందిస్తున్నామన్నారు.

గత ప్రభుత్వంలో పుష్కలంగా యూరియా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు యూరియా పుష్కలంగా లభించేదని పీఏసీఎస్ మాజీ ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి గుర్తుచేశారు. కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులు సాగునీటి, ఎరువుల కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యూరియా సరఫరాలో విఫలమైన చంద్రబాబు.. యూరియా వాడితే క్యాన్సర్ వస్తుందని వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. సకాలంలో పంటలకు యూరియా వేయకపోతే ఎలా అని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌లు పురుషోత్తంరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాల్‌మిల్ అమీర్, సెక్రెటరీ సోమశేఖర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, కౌన్సిలర్ ఆరిఫ్‌నాయక్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ శవమై తేలి..

● అనుమానం వ్యక్తం చేస్తున్న బంధువులు



మృతి చెందిన మైథిలీ (ఫైల్)

పాములపాడు/కర్నూలు(రూరల్): ఐదు రోజుల క్రితం అదృశ్యమైన కర్నూలు మండలం పూడూరు గ్రామానికి చెందిన మైథిలీ (24) శుక్రవారం బానకచెర్ల గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ పవర్‌హౌస్ వద్ద శవమై కనిపించింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. రెండేళ్ల క్రితం మైథిలీకి వివాహం కాగా.. ఏడాది క్రితం భర్తతో విడిపోయి పుట్టింటికి చేరింది. కర్నూలు నగరంలో ఓ కర్రీ పాయింట్‌లో రొట్టెలు చేస్తూ జీవనం సాగిస్తోంది. అక్కడే ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటోంది. కాగా గత నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో పూడూరు గ్రామంలో కేసీ కెనాల్ వద్ద దుస్తులు ఉతికేందుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె సోదరి భారతి కేసీ కెనాల్ వద్దకు వెళ్లి చూడా మైథిలీ కనిపించ లేదు. అక్కడ మెట్ల వద్ద కేవలం ఒక డబ్బా మాత్రమే కనిపించింది. ఆ సమయంలో కొందరు వ్యక్తులు మద్యం సేవించి అటుగా వెళ్లినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా మైథిలీ మొబైల్ అదృశ్యమైన రెండు రోజులకు ఒక వ్యక్తికి ఆమె ఫోన్ దొరకగా మరో వ్యక్తి ద్వారా కుటుంబ సభ్యులకు పంపించారు. మొబైల్లో సిమ్ కార్డు లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 1వ తేదీన మైథిలీ తండ్రి బోరెల్లి ఫిర్యాదు మేరకు కర్నూలు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం బానకచెర్ల గ్రామ సమీపంలోని కేసీ కెనాల్ పవర్‌హౌస్ వద్ద శవమై కనిపించింది. మృతదేహం బాగా ఉబ్బిపోయి గుర్తు పట్టని విధంగా మారడంతో ఆమె ధరించిన దస్తులను బట్టి కుటుంబీకులు మైథిలీగా గుర్తించారు. సమాచారం అందుకున్న కర్నూలు తాలుకా పోలీసు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. గ్రామానికి చెందిన ఓ యువకుడిని అదుపులోకి పోలీసులు విచారించినట్లు తెలుస్తోంది.

మోటార్ల దొంగలను వెంటాడి పట్టుకున్న రైతు

ఆత్మకూరురూరల్: మోటార్ల దొంగలను వెంటాడి పట్టుకున్న ఘటన ఆత్మకూరు మండలంలోని సిద్దపల్లె – పెద్దనంతాపురం మధ్య గురువారం రాత్రి జరిగింది. ముష్టపల్లె గ్రామానికి చెందిన కౌలు రైతు శివాజి నాయక్ సిద్దాపురం చెరువు ఎడమ కాల్వ నీటిపై ఆధారపడి పొలం సాగు చేసుకుంటున్నాడు. పొలంలో మోటార్‌ను తస్కరించి దొంగలు ద్విచక్రవాహనంపై పారిపోతుండగా రైతు శివాజీ నాయక్ తన మోటార్ సైకిల్‌ను అడ్డుగా నిలిపి వారిని పట్టుకున్నారు. దొంగతనానికి పాల్పడింది సిద్దపల్లె గ్రామానికి చెందిన సుబ్బారాయుడు, మధుగా గుర్తించారు. చుట్టు పక్కల రైతులు వీరిద్దరినీ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా మోటార్ల దొంగలపై ఎలాంటి కేసులేకుండా వదలి వేయాలని టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

నిమజ్జనంలో అపశ్రుతులు

47 మంది ఆసుపత్రి పాలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో గురు, శుక్రవారాల్లో జరిగిన వినాయక నిమజ్జనంలో అపశ్రుతులు చోటుచేసుకున్నాయి. వివిధ కారణాలతో అస్వస్థతకు గురై 47 మంది ఆసుపత్రి పాలయ్యారు. ఇందులో బైక్ ప్రమాదాలు, వివిధ రకాల రోడ్డు ప్రమాదాలు, తోపులాటలో కింద పడటం, వాహనాలపై నుంచి పొరపాటుగా కిందపడటం, ఘర్షణల్లో గాయపడటం వంటివి ఉన్నాయి. వీరంతా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీకి వచ్చి చికిత్స చేయించుకుని వెళ్లిపోయారు. ఇలాంటి ఘటనలు జరిగి అధిక సంఖ్యలో క్షతగాత్రులు వస్తారన్న ఉద్దేశంతో ఆసుపత్రి అధికారులు ఎక్కువ మంది వైద్యులు, సిబ్బందిని క్యాజువాలిటీలో ఉంచారు. ఈ మేరకు వచ్చిన వారికి వచ్చినట్లు ప్రథమ చికిత్స అందించి పంపించారు. 45 మంది ఓపీ డిశ్చార్జ్ కాగా ఒకరికి ఫ్యాక్చర్ కావడంతో అడ్మిట్ చేశారు. ఒకరు కత్తిపోట్లకు గురికావడంతో అత్యవసరంగా ఆపరేషన్ నిర్వహించారు.

రక్త పరీక్షలు చేయించండి

జూపాడుబంగ్లా: జ్వరాల బారిన పడిన వారికి రక్త పరీక్షలు చేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మౌలిక వసతులను గురించి డాక్టర్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. విషజ్వరాలు వ్యాపించకుండా నిరంతరం ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరించాలన్నారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. అనంతరం సమీపంలోని కస్తూర్బా పాఠశాలను పరిశీలించి అందులోని విద్యార్థుల ఆరోగ్యస్థితిగతులపై ఆరా తీశారు. ఎవ్వరికైనా జ్వరం, వాంతులు, విరేచనాలు, దగ్గు, జలుబు, జ్వరం, డెంగూ, మలేరియా వంటి జ్వరాలు వ్యాపించినట్లయితే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈయన వెంట హెల్త్‌సూపర్‌వైజర్లు విజయలక్ష్మమ్మ, రాముడు, ల్యాబ్‌అసిస్టెంటు చెంచన్న, వైద్యసిబ్బంది ఉన్నారు.



ఆసుపత్రి సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ